విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమ గోదావరి

'నా మట్టి–నా దేశం' ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర–భీమవరం: ఈనెల 9 నుంచి 20 వరకు జిల్లావ్యాప్తంగా 'నా మట్టి నా దేశం' కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో "నా మట్టి –నా దేశం, నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం "అనే ప్రత్యేక కార్యక్రమంపై అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 9న అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సందేశంతో పాటు దేశం కోసం పోరాడిన స్వాతంత్ర సమరయోధులు, త్యాగ ధనులు, వీరులను గుర్తు చేసుకుంటూ అమృత సరోవర్లు నీటి వనరుల వద్ద జ్ఞాపక శిలాఫలకాలను ఏర్పాటు చేసుకొని సెల్ఫీలను దిగి నిర్ణీత వెబ్సైట్లో అప్లోడ్ చేయాల న్నారు. ప్రధానంగా జిల్లాలో ఎంపిక చేసిన అమృత్ సరో వర్లు, పాఠశాలలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలందరూ మట్టిని గాని మట్టి దీపాన్ని గాని చేతిలో ఉంచుకొని పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేయాలన్నారు. గ్రామపంచాయతీలు, మండలాలకు చెందిన యువత వారి ప్రాంతాల్లోని మట్టిని కలశాలలో తీసుకుని ఢిల్లీకి ప్రయాణమై ఈనెల 27, 28 తేదీలలో ఢిల్లీకి చేరుకుని అక్కడ కర్తవ్య పథ్‌లో జరిగే ముగింపు కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సంబంధిత శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత దుస్తులు ధరించడంతోపాటు, ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో కోరారు. ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించు కుంటున్నామన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకునేలా గ్రామీణ వర్గాల వారిని ప్రోత్సహించాలని కోరారు. చేనేతకు మద్దతివ్వడానికి ప్రతీకగా చేనేత వస్త్ర ధారణ దినోత్సవం ఆగస్టు 7న పౌరులు, అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, కార్మికులు, రైతులు, ప్రైవేటు ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు చేనేత దుస్తులు ధరించి చేనేత దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

9 నుంచి 'నామట్టి నా దేశం: కలెక్టర్ వెంకటేష్

విశాలాంధ్ర–ఏలూరు: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలలో భాగంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకుంటూ ఈ నెల 9వ తేదీ నుండి 30వ తేదీ వరకు జిల్లాలో నా మట్టి .. నా దేశం నేల తల్లికి నమస్కారం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించుకుందామని జిల్లా కలెక్టర్ వై ప్రసన్న వెంకటేష్ పిలుపునిచ్చారు. ప్రజలలో దేశ భక్తిని ప్రేరేపించేందుకు, వారిని ఉత్తేజపరిచేందుకు "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" లో భాగంగా " నా మట్టి .. నా దేశం నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనం " కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని గ్రామాలలో ఈ నెల 9వ తేదీన నిర్వహించుకోవాలన్నారు.

ఆయా గ్రామాలలో అమృత్ సరోవర్ చెరువుల వద్ద శిలాఫలకాలను ఏర్పాటుచేయాలన్నారు. ఆ శిలాఫలకంలో ఆ గ్రామంలో దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల పేర్లను లిఖించాలన్నారు. రక్షణా సిబ్బంది, రక్షణ రంగ ఉద్యోగులు, రాష్ట్ర పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు దళ సిబ్బంది పేర్లు పొందుపరచాలన్నారు. అమృత్ సరోవర్ చెరువులు లేని ప్రదేశాలలో గ్రామ పంచాయతీ కార్యాలయాల కార్యక్రమం ఏర్పాటుచేయాలన్నారు. గ్రామంలోని యువత, ప్రజలతో అనంతరం 10 వ తేదీన 'పంచ ప్రాణ' ప్రతిజ్ఞ నిర్వహించాలన్నారు. ప్రతిజ్ఞ చేసేటప్పుడు మట్టి దీపాన్ని చేతిలో ఉంచాలన్నారు.

11, 12 తేదీలలో గ్రామాలలోని సేకరించిన మట్టిని కలశాలలో మండల పరిషత్ కార్యాలయాలకు పంపించాలన్నారు.

ఈనెల15వ తేదీన శిలాఫలకాలు ఉంచిన చోట జాతీయ జెండాను ఆవిష్కరిం చాలన్నారు. ప్రతీ మండలంలో ఎంపిక చేసిన యువత మట్టి కలశాలను ఈనెల 29, 30వ తేదీన ఢిల్లీ లోని నిర్మించనున్న అమృత్ మహల్ కు అందజేయాలన్నారు. " నా మట్టి .. నా దేశం నేల తల్లికి నమస్కారం" లో ప్రజాప్రనిధులందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

గోద్రెజ్ కంపెనీతో వ్యవసాయరంగం అభివృద్ధి

విశాలాంధ్ర–ముసునూరు: గాద్రేజ్‌కు చెందిన పామాయిల్ కంపెనీతో వ్యవసాయరంగం మరింత అభివృద్ధి చెందుతుందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆదివారం ముసునూరులో రైతులకు గాద్రేజ్ ఫామ్‌యిల్ కంపెనీ మొక్కలు అందించారు. ముసునూరు మండల వైసీపీ అధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు మాట్లాడుతూ ఫామ్‌యిల్ మొక్కలు కొరత లేకుండా చూడాలని, దిగుబడి పెంచుకునేందుగాను పామ్‌యిల్ తోటల్లోకి శాస్త్ర వేత్తలతో సమావేశాలు నిర్వహించాలని కోరారు. జడ్పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపీపీ రాపర్ల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన, పాముల గంగధరరావు, సర్పంచ్ కే విజయలక్ష్మి, గాద్రేజ్ కంపెనీ అసోసియేషన్ ఉపాధ్యాక్షుడు చావ్లా వెంకటేశ్వరావు, జనరల్ మేనేజర్ స్వీటి, హార్టికల్చరల్ మండల అధికారి ప్రియాంక, సూపర్‌వైజరు దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

విశాలాంధ్ర–ఏలూరు: అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద ఏలూరు రైల్వే స్టేషన్ ఆధునీకరణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏలూరు వచ్చిన రాష్ట్ర గవర్నరు ఎస్. అబ్దుల్ నజీర్‌కు జిల్లా కలెక్టర్ వై ప్రసన్న వెంకటేష్ పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అలాగే జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, మేయర్ షేక్ నూర్జాహాన్ పెదబాబు, రైల్వే డీఆర్ఎం నరేంద్ర, ఆనందరావు పాటిల్ పుష్పగుచ్ఛాలు అందజేశారు.

డీఐజీ, ఎస్పీ స్వాగతం

విశాలాంధ్ర–ఏలూరు: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదివారం విజయవాడ నుంచి ఏలూరు చేరుకోగా, ఆయనకు ఘనస్వాగతం లభించింది. ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ డీ మేరీ ప్రశాంతి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.

గద్దర్ మృతితో అభిమానుల్లో విషాదం

విశాలాంధ్ర–లింగపాలెం: ప్రజా గాయకుడు గద్దర్ మృతి చెందిన వార్త తెలుసుకున్న ఈయన అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెంతో ఈయనకు ప్రత్యేక అనుబంధం ఉంది. దాదాపు 40 ఏళ్ళ క్రితం ఈయన గ్రామంలో ప్రజా ప్రదర్శన నిర్వహించారు. అప్పట్లో పౌర హక్కుల సంఘ నేత దివంగత గారపాటి పునేశ్వరరావు, ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఉద్యమనేతగా గుర్తింపు ఉన్న సి.హెచ్.రాఘవులతో గద్దర్‌కు సన్నిహిత సంబంధాలు ఉండేవి. ప్రజా గాయకునిగా గద్దర్‌కు మండలంలో అభిమానులు ఉన్నారు. ఈయన హఠాన్మరణంతో అభిమానుల్లో విషాదం అలముకుంది.

బస్టాండు ఆక్రమణలపై గవర్నర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర–లింగపాలెం: ధర్మాజీ గూడెం బస్టాండు దుస్థితిపై రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లింగపాలెం మండల బిజెపి అధ్యక్షుడు కుర్రా వెంకట సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్ (సుబ్బారావు) వినతి పత్రం ఇచ్చారు. గవర్నర్ ఏలూరు పర్యటనకు ఆదివారం వచ్చిన సందర్భంగా ఈయనను కలిసి బిజెపి అధ్యక్షుడు వినతి పత్రం అందించారు. బస్టాండు ఆక్రమణలకు గురవ్వటం వల్ల ప్రతీరోజు వందలాది మంది ప్రయాణికులు పడే అవస్థలను వినతిపత్రంలో పేర్కొన్నారు. బస్టాండు ఆక్రమణలను, బస్‌షెల్టర్ దురాక్రమణలను తొలగించాలని ఆర్టీసి అధికారులకు, ఇతర శాఖల అధికారులకు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవటంలేదంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆక్రమణలు తొలగించి సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

డాక్టర్ పట్టా భరత్‌కు ఘన సత్కారం

విశాలాంధ్ర–భీమవరం: భారతీయ సంస్కృతి సంప్రదాయాలను అన్ని దేశాల్లో అభిమానిస్తారని ఇంగ్లాండ్‌కు చెందిన క్రిష్టియన్ బైబిల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ పట్టా భరత్, షైనీ రాజ్ భరత్ అన్నారు. ఇంగ్లాండ్ క్రిష్టియన్ బైబిల్ కళాశాలలో పని చేస్తున్న పట్టణానికి చెందిన పట్టా భరత్, షైనీ రాజ్ భరత్‌లను ఆదివారం బేతనీ లూథరన్ చర్చిలో సంఘస్తులు సత్కరించారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంట సుందర్ కుమార్, ఎఎంసి మాజీ డైరెక్టర్ గంటా అనితారాణి, ఎఇఎల్సీఈ పెద్దలు దేవరాజు, ఇందిర, వర్గీస్ డానియల్ పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన విజయవంతం చేయండి

విశాలాంధ్ర–కొయ్యలగూడెం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్ర బాబు పోలవరం పర్యటన విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షులు పారేపల్లి నరేష్ కోరారు. కొయ్యలగూడెం మండలం నుండి అధిక సంఖ్యలో నాయకులు, కార్య కర్తలు, అభిమానులు, రైతులు, మహిళలు, యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు.

గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

విశాలాంధ్ర–భీమవరం: ప్రజా గాయకుడు గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఎఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. ఆదివారం భీమవరంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ తాము విద్యార్థి ఉద్యమాల్లో ఉన్నప్పుడు గద్దర్ ను పలుమార్లు కలిశామని, ఆయన చాలా సార్లు భీమవరం వచ్చినప్పుడు విద్యార్థులను చైతన్య పరిచారని గుర్తుచేశారు. సైద్ధాంతికంగా ఆయన ఆశయాలు గొప్పవని వాటిని ఆచరించాలని చెల్లబోయిన అన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కిలారి మల్లేశ్వరరావు, నాయకులు బంగారు శివ, బి.సత్యనారాయణ, నీలాపు శ్రీను, ఆశీర్వాదం, రెల్ల రాము, పి.యాకోబు తదితరులు సంతాపం తెలిపారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

విశాలాంధ్ర–భీమవరంటౌన్: స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో నాయకులు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో రాజకీయంగా మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. పశ్చిమగోదావరి జిల్లా ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు పేరి చర్ల విజయ నరసింహారాజు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, జవ్వాది సత్తిబాబు పాల్గొన్నారు.

రైతుల ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర–తణుకు: రైతులు, కౌలు రైతులకు ప్రతీ ఎకరాకు సాగుపెట్టుబడిగా రూ. 10వేలు ఆర్థిక సాయమందించాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో తలపెట్టిన రైతుల ధర్నా విజయవంతం చేయాలని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. ఆదివారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో 'చలో విజయవాడ' రైతుల ధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించే ఆలోచన ఉపసంహరించు కోవాలని, సర్వే నంబర్లు ఆధారంగా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, రైతులు, కౌలు రైతులకు అన్ని రకాల పంట రుణాలను రూ. 2లక్షల వరకు మాఫీ చేయాలని తదితర డిమాండ్ల సాధన కోరుతూ చేపట్టిన రైతుల ధర్నా విజయవంతం చేయాలని భీమారావు కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు,జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, నెక్కంటి క్రాంతి కుమార్, సికిలే పుష్పకుమారి,టి.అప్పలస్వామి, జిల్లా సమితి సభ్యులు నామాన వెంకటేశ్వరరావు, మండల నాగేశ్వరరావు, మల్లుల శ్రీనివాస్, బొద్దాని కృష్ణ కిషోర్, పి.పి.జోషి తదితరులు పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర–భీమవరం: మున్సిపల్ కార్మికులు అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఉద్యమాలు నిర్వహించి పాలకుల మెడలు వంచుతామని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు అన్నారు. మున్సిపల్ కార్మికుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం ఏఐటీయూసీ అధ్వర్యంలో భీమవరంలో మున్సిపల్ కార్మికులు మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. అధికారం చేపట్టిన వెంటనే కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తానన్న జగన్ మాట తప్పారని రంగారావు విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికులకు మెడికల్ అలవెన్సు 6,000 ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులందరికీ పి.ఎఫ్, ఇఎస్ఐ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ బైక్ ర్యాలీలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కిలారి మల్లేశ్వరరావు, నాయకులు బంగారు శివ, బి.సత్యనారాయణ, నీలాపు శ్రీను, ఆశీర్వాదం, రెల్ల రాము తదితరులు పాల్గొన్నారు.

వర్కర్స్ యూనియన్ మహాసభ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర–ఏలూరు: ఈనెల 23, 24 తేదీల్లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ ఏలూరులో జరుగుతుందని, దీని జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భజంత్రీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆదివారం మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, కార్మికులకు కనీస వేతనం సమాన పనికి సమాన వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీనియారిటీ ప్రకారం క్రమబద్ధీకరించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మహాసభలో మున్సిపల్ వర్కర్స్ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏలూరు నగర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు యలగాడ దుర్గారావు, కార్యనిర్వాహక అధ్యక్షులు దొడ్డిగర్ల నాగబాబు, ఉపాధ్యక్షులు బంగారు దుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శి అంతరాజ్ కిరణ్, బంగారు కృష్ణ, పేదారి వంశి, కార్యవర్గ సభ్యులు మాదుగుల జగదీష్, కిలారి వెంకన్న బాబు, చెన్న చంద్రావతి, గంధరపు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అటవీ బంజరు భూములకు పట్టాలివ్వాలి

విశాలాంధ్ర–కామవరపుకోట: కామవరపు కోట మండలంలో పేదల సాగులో ఉన్న అడవి బంజరులకు పట్టాలవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వర రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కామవరపుకోటలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 10వ మండల మహాసభ జరిగింది. మహాసభకు ధర్మయ్య రావులమ్మ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. బీకేఎంయూ జెండాను సీనియర్ నాయకులు నరసింహారావు ఆవిష్కరించారు. అనంతరం బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలలో కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను చేర్చి పేదల ఆక్రమణంలో ఉన్న అడవి బంజరులను మిగిలిన భూములకు పట్టాలవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచె వసంతరావు మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం సాగుభూమి సొంతం కోసం వ్యవసాయ కార్మిక సంఘం గత 87 సంవత్సరాలుగా ఎన్నో పోరాటాలు ఉద్యమాలు నిర్వహించి లక్షలాది ఎకరాలు మిగులు భూములు అటవీ బంజర్లు పేదలకు సాధించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోలిమే బాల యేసు, సీపీఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు, ఏఐటీయూసీ చింతలపూడి నియోజకవర్గ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జి సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. అనంతరం కామవరపుకోట మండలానికి వ్యవసాయ కార్మిక సంఘం 11 మందితో కమిటీ ఎన్నికైనది. అధ్యక్షులుగా కరేటి నరసింహులు, ఉపాధ్యక్షులుగా మందపాటి ధర్మయ్య, ప్రధాన కార్యదర్శిగా గుద్దేటి సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా సిరిసెట్టి బాల సుందరం, కోశాధికారిగా నల్లబోతుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

గద్దర్ మృతికి వామపక్ష నాయకుల నివాళి

విశాలాంధ్ర–భీమవరం: బడుగు బలహీన వర్గాల దళిత పోరాటాల ఉద్యమాలకు ఊపుతెచ్చిన గద్దర్ మృతి ప్రజా సాంస్కృతిక ఉద్యమాలకు తీరని లోటని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. ఆదివారం భీమవరంలో ఆయన గద్దర్ మృతి పై నివాళులర్పించారు. జననాట్య మండలి వ్యవస్థాపకులుగా ప్రగతిశీల సాంస్కృతిక ఉద్యమాలకు గద్దర్ ఎన్నో సేవలు అందించారని ఎన్నో విప్లవత్మక సినిమాలకు పాటలు కూడా రాశారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. గద్దర్ మృతికి చాంద్ బాషా తిరుమని కామేశ్వరరావు,తిరుమని చంటి రాజు, ఉగాది, అరటి కట్ల నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, కాటి వెంకటరత్నం, ఆక్వా శ్రీనివాస్, గొన్నబత్తుల మల్లేశ్వరరావు, నాగిడి శాంతమూర్తి, అడ్డాల సత్యనారాయణ గిద్ద సూర్యనారాయణ, ఎం.లాల్ సన్, వేల్పుల నాగేశ్వరరావు, సిహెచ్ నాగేశ్వరరావు నివాళి అర్పించారు.

ఏలూరు జిల్లా సమితి సంతాపం

ఏలూరు: తన జానపద పాటలతో ప్రజలలో చైతన్యం తీసుకువచ్చిన ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. దళిత పేదలు అనుభవిస్తున్న కష్ట నష్టాలను తనబృందం కళ్ళకు కట్టినట్లుగా పాటలు, నాటకాల రూపంలో తెలియజేసే వారన్నారు. గద్దర్ మరణం పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు.

కోనాల భీమారావు సంతాపం

తణుకు: గద్దర్ మృతికి సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తీవ్ర సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గద్దర్ మృతి సామాజిక ఉద్యమాలకు, ప్రజా పోరాటాలకు తీరని లోటుగా పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో ఎంతోమంది విప్లవ గాయకులు వచ్చారన్నారు. పదునైన జానపద సాహిత్యంతో ప్రజల్లో ఉత్తేజాన్ని నింపి సామాజిక, ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు కృషి చేశారన్నారు.

రూ.73.05 కోట్లతో మూడు రైల్వేస్టేషన్ల అభివృద్ధి

విశాలాంధ్ర–భీమవరం: సామాన్యుడు సైతం తక్కువ ఖర్చుతో ఎక్కువ కిలో మీటర్లు ప్రయాణం చేసే అవకాశం మన భారత రైల్వేకి మాత్రమే ఉందని, నూతన జిల్లాలో రూ.73.05 కోట్లతో మూడు రైల్వే స్టేషన్లు అభివృద్ధికి సంకల్పించడం అభినందనీయం అని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా దేశవ్యాప్తంగా 508 రైల్వేస్టేషన్లు పునరాభివృద్ధికి లాంఛనంగా శంకుస్థాపనను వర్చువల్‌గా చేశారు. ఆదివారం భీమవరం టౌన్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని తిలకించడానికి శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, రైల్వేశాఖ అధికారులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, వివిధ సంఘాలు, తదితరులు పాల్గొన్నారు. మోషేన్ రాజు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన పశ్చిమ గోదావరి జిల్లాలో 3 రైల్వే స్టేషన్లు అభివృద్ధి చాలా సంతోషించవలసిన విషయం అన్నారు. మన నరసాపురం పార్లమెంటు నియోజకవర్గంలో 73.05 కోట్లతో మూడు స్టేషన్ లు భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం స్టేషన్లలో పార్కింగ్, విశ్రాంతి మందిరాలు, స్టాల్సు, ఆధునిక సౌకర్యాలతో సుందరవదనంగా మరింత శోభ చేకూరుతుందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణ వేణి, మాజీ శాసన సభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ), బిజెపి నాయకులు భూపతి రాజు శ్రీనివాస వర్మ, పాకా సత్యనారాయణ, మాజీ పుర పాలక సంఘం చైర్మన్ కోటికలపూడి గోవిందరావు, స్టేషన్ మాష్టరు వి.చక్రవర్తి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ జి.మధుబాబు, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకు వాడ రంగసాయి, రైల్వే శాఖ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యార్థిని విద్యార్థులు, వివిధ సంఘాలు ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన రద్దు

విశాలాంధ్ర–ఏలూరు: ముఖ్యమంత్రి జిల్లాలోని కుక్కునూరు మండలంలో వరద సహాయక చర్యల పరిశీలనా పర్యటన దృష్ట్యా జిల్లా, డివిజనల్, మండల స్థాయి అధికారులందరూ సంబంధిత విధులలో నిమగ్నమైనందున సోమవారము జిల్లా కలెక్టర్ కార్యాలయం, జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మునిసిపల్ కార్యాలయాల్లో నిర్వహించే 'స్పందన' కార్యక్రమము రద్దు చేయబడినదని జిల్లా కలెక్టర్ వై ప్రసన్న వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విజయవాడలో మహాధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర–ఏలూరు: ఆగస్టు 9క్విట్ ఇండియా స్ఫూర్తితో క్విట్ మోదీ నినాదంతో కేంద్ర కార్మిక సంఘాలన్నీ తలపెట్టిన చలో విజయవాడ మహాధర్నాలో కార్మిక వర్గం, ఉద్యోగులు పాల్గొనాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్టీయూ సంఘాలు పిలుపునిచ్చాయి. ఆదివారం సీఐటీయూ జిల్లా ఆఫీసులో జరిగిన కేంద్ర కార్మిక సంఘాల సమావేశంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడారు. మోదీ పాలనలో కార్మికుల న్యాయమైన కోర్కెలు పరిష్కారం కాలేదన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోర్టు తీర్పులు సూచించినా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అఖిలభారత సమ్మెలతో కార్మిక, ఉద్యోగ వర్గాలు నిరసనలు తెలియజేస్తున్నా మోదీ ప్రభుత్వానికి చలనం లేదన్నారు. అదానీ, అంబానీలకు సహజ వనరులను, ఖనిజాలను దోచి పెట్టేందుకు మణిపూర్ వంటి గిరిజన జాతుల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకపక్క మణిపూర్ తగలబడుతుంటే అక్కడ పరిస్థితులను బాహ్య ప్రపంచానికి తెలియకుండా చేసేందుకు, ఇంటర్నెట్ సౌకర్యాలను నిలిపివేసిందని కోర్టు జోక్యంతో పునరుద్ధరించిన శాంతిభద్రతలను కాపాడడంలో డబుల్ ఇంజన్ సర్కారు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను మన రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం విద్యుత్, మునిసిపల్, సహకార, రవాణా, విద్య తదితర రంగాలలో అమలు చేస్తూ ప్రజలపై తీవ్ర భారాలను మోపుతోందన్నారు. ఆగస్టు 9వ తేదీ చలో విజయవాడ క్విట్ మోదీ కార్యక్రమంలో పాల్గొని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు కే.విజయ లక్ష్మి, వి.సాయిబాబు, జె.గోపి, జాన్ బాబు,రమణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు గవర్నర్ శంకుస్థాపన

విశాలాంధ్ర–ఏలూరు: ఏలూరు రైల్వేస్టేషన్‌లో రూ. 21.1కోట్ల వ్యయంతో అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదివారం శంకుస్థాపన చేసారు. విజయవాడ నుంచి ఏలూరు చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏలూరు రైల్వే స్టేషన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. ఢిల్లీ నుంచి దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో సందేశం కార్యక్రమాన్ని ఆయన వీక్షించారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, డీఐజీ జీ.వీ.జీ అశోక్ కుమార్, ఎస్పీ మేరీ ప్రశాంతి, రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్, సీనియం డీసీఎం వావిలాలపల్లి రాంబాబు, సీనియర్ డీఈఎన్ఎస్ వరుణ్ బాబు, సీనియం డీఓఎం నరేంద్ర వర్మ, సీనియర్ డీఎస్‌సీ వల్లేశ్వర్ బాబ్జి తొక్కల, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, ఎంఎల్‌సీ వంకా రవీంద్రనాథ్, మాజీ ఎంపీ మాగంటి బాబు, పలువురు బిజేపి నాయకులు పాల్గొన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా ఈ రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారంతో పాటు ప్రయాణ ప్రాంగణం, ట్రాఫిక్ వసతులు, వెయిటింగ్ గదులు, ప్రయాణికులకు అనువుగా ఉండే సమాచార సూచికలు వృద్ధి చేయనున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

విశాలాంధ్ర–జంగారెడ్డిగూడెం: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడానికి ఆయా గ్రామ శాఖలు అలుపెరగని కృషి చేయాలని, అందుకు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణ రాజు పిలుపు నిచ్చారు. శనివారం రాత్రి మండలంలోని గొల్లగూడెం గ్రామ శాఖా సమావేశం చాకిరి సోమరాజు అధ్యక్షతన జరిగింది. సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జేవీ రమణ రాజు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి కుంచె వసంతరావు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. సీపీఐ గొల్లగూడెం శాఖకు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యదర్శిగా పేరుబోయిన నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ఎర్రగొర్ల సూర్య చంద్రం, కమిటీ సభ్యులుగా చెమటబోయిన మహేష్, ఎర్రగొర్ల రామకృష్ణ,మానికల రమేష్ లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రమణరాజు తెలిపారు. ఈ కమిటీకి అభినందనలు తెలియజేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీ నర్ చాకిరి సురేష్, ఎర్ర గొర్ల బజారు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-టీ నరసాపురం: ఏలూరు జిల్లాలో జరిగే చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీ రామ మూర్తి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టి నరసాపురంలో టిడిపి మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణా రావు గౌడ్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పట్టిసీమలో యామిని ఫంక్షన్ హాల్ లో కార్యకర్తలతో ముఖాముఖీ నిర్వహిస్తారని ఆయన తెలిపారు. అనంతరం పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తారని తెలిపారు. మండలంలోని 15 పంచాయతీల నుండి కార్యకర్తలు తరలివచ్చి బాబు పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆచంట బాబీ, నాళం కాశీ, పెద్దిన చంద్రశేఖర్, వీరేశలింగం, పెద్దిన సురేష్ ,యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పం వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-ఉండి: జగనన్న స్వచ్ఛ సంకల్పం పథకాన్ని ఎన్ ఆర్ పి అగ్రహారం పంచాయతీ పరిధిలోని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎన్ ఆర్ పి అగ్రహారం గ్రామ సర్పంచ్ సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు తెలిపారు. ఎన్ ఆర్ పి అగ్రహారం గ్రామ పంచాయతీ వద్ద ఆదివారం జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఇంటి పన్ను కట్టిన ప్రతి ఒక్కరికి తడి చెత్త పొడి చెత్త వేసుకునేందుకు ప్లాస్టిక్ బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కనకదుర్గ వెంకటాచార్యులు మాట్లాడుతూ. గ్రామాభివృద్ధికి గ్రామస్తులందరూ సహకరించాలని వారు కోరారు. సకాలంలో ఇంటి పన్ను నీటి పన్ను కడుతూ గ్రామ అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని వారు తెలిపారు ఇందులో భాగమే జగనన్న స్వచ్ఛ సంకల్పం అని వారు తెలిపారు. ఈ ప్లాస్టిక్ బుట్టలు అందని వారు ఇంటి పన్ను నీటి పన్నులు కట్టి తడిసత్త పొడి చెత్త వేసుకునేందుకు ప్లాస్టిక్ బుట్టలను తీసుకువెళ్లాలని వారి కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జేవీటి నాయుడు, ఎంపీటీసీ మున్నలూరు సువర్ణ లక్ష్మి శ్రీనివాస్, ఉప సర్పంచ్ కరాలి సత్యనారాయణ, బోర్డు సభ్యులు రెడ్డి శ్రీను నలభ పోతురాజు సచివాలయ సిబ్బంది వాలంటీర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ముఖ్యమంత్రి జగన్ పర్యటన

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ నేడు ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు.నేటి మధ్యాహ్నం గం.1.05లకు కూనవరం మండలం కోతులగుట్ట నుంచి హెలికాప్టర్ లో బయలుదేరి మధ్యాహ్నం గం.1.40లకు కుకునూరు మండలం గొమ్ముగూడెం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ కు చేరుకుంటారు. మధ్యాహ్నం గం.1.45 నుంచి మధ్యాహ్నం 2.00వరకు స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం గం.2.10లకు హెలీప్యాడ్ నుండి బయలుదేరి మధ్యాహ్నం గం.2.20లకు గొమ్ముగూడెం గ్రామానికి చేరుకొని, మధ్యాహ్నం గం.2.20 నుంచి 2.50 వరకు వరద బాధిత నివాసిత ప్రాంతాల్లో కాలినడకన పర్యటించి, బాధితులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. మధ్యాహ్నం గం2.55 నుండి 3.25 మధ్య వరద నష్టాలపై జిల్లా యంత్రాంగం ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్ ను తిలకిస్తారు. అనంతరం గొమ్ముగూడెం కు చెందిన వరద ముంపు బాధితులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం గం.3.30లకు వ్యూపాయింట్ నుంచి బయలుదేరి గం.3.35లకు గొమ్ముగూడెంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ కు చేరుకొని అక్కడి నుండి హెలికాప్టర్ లో రాజమండ్రి బయలుదేరి వెళతారు.

నిర్వాసితులకు నగదు కూరగాయల పంపిణీ

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం: ఇటీవల వచ్చిన గోదావరి వరదల కారణంగా ఇబ్బందులు పడిన వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున చల్లవారి గూడెం ఆర్ అండ్ అర్ కాలనీలో గల శ్రీరామ్ పురం, కటుకూరు, కోయిధా,చిగురు మామిడి, నార్లవారం గ్రామాలకు చెందిన సుమారు 400 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2వేలు నగదు, ఆరు రకాల కూరగాయలు,ఇరవై ఐదు కేజీల బియ్యం,మంచి నూనె ,ఆయిల్ ప్యాకెట్ ను ఆదివారం పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించిన ఈ సహాయం పై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కాలనీ వైసిపి యూత్ అధ్యక్షుడు బద్దె.ప్రేమ్ కుమార్ ,సీనియర్ నాయకులు బద్దె.కృష్ణ, పెరుమాళ్ళ నరసింహారావు, కాలనీ అధ్యక్షుడు గిల్లబత్తిన వెంకటేశ్వర్లు, బద్దె.ప్రసన్న కుమార్, వరక ప్రసాద్,పట్రా వెంకటేష్, వీరేంద్ర, వలపర్ల శ్రీను,సుధాకర్,బాల కృష్ణ,వీర బాబు,రెవిన్యూ సిబ్బంది,మరియు వాలంటీర్లు ఉన్నారు.

గద్దర్ మృతి పట్ల ఎమ్మెల్యే గ్రంధి సంతాపం

విశాలాంధ్ర-భీమవరంటౌన్: జానపద పాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన ప్రకటన విడుదల చేశారు. జానపద పాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చారని, ముఖ్యంగా దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి గద్దర్ ఎంతో కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా ఏం పిల్లడో ఎల్దమొస్తవా లాంటి ఎన్నో జానపద గీతాలు ఆయన నోటివెంట వెలువడ్డాయని ఆయన గుర్తు చేసుకున్నారు. గద్దర్ మరణానికి చింతిస్తున్నానని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నానని ఆయన అన్నారు.

ఘనంగా శ్రీముత్యాలమ్మ జాతర

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: గ్రామం ఆరాధ్య దైవం శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి సేవ జాతర కార్యక్రమాన్ని గ్రామస్తులు సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు వైభవ్ పెతంగా నిర్వహించారు. పాడిపంటలు తో పాటు గ్రామం సుభిక్షంగా ఉండాలని వర్షాలు సకాలంలో పడి పంటలు సమృద్ధిగా పండాలని ముత్యాలమ్మ తల్లిని కోరినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో వీధివీధిన అమ్మవార్లను ఊరేగింపు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

యుద్ధభేరీకి తరలిరండి

విశాలాంధ్ర-చాట్రాయి: యుద్ధ భేరికి తెలుగు రైతు నేతలంతా తరలిరావాలని జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వర పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం ఆయన ఒక ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం యుద్ధ బేరీ కార్యక్రమంలో జాతీయ టీడీపీ అధ్యక్షులు చంద్రబాబు జిల్లా లోని పోలవరం లో రేపు పర్యటన జరుగుతుంది. పోలవరం మండలం పట్టిసీమ యామిని కల్యాణమండపంనకుగం.12 గంటలకు చేరుకుంటారు. పోలవరం రైతులతో, నిర్వాసితులతో మాట్లాడి పోలవరం ప్రాజెక్ట్ పై పవరపాయింట్ ప్రెసెంటేషన్ చేస్తారు. అక్కడ నుండి బయులు దేరి పోలవరం ప్రాజెక్ట్ ను సందర్శిస్తారు. సాయంత్రం గం.4లకు బయులుదేరి గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి సెంటర్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ లో పాల్గొంటారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-గొల్లప్రోలు: పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఆదివారం శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్తికేయ సూపర్ స్పెషాలిటీ క్లినిక్ వారిచే మండల స్థాయి ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 1000 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేయడం జరిగిందని ట్రస్ట్ చైర్మన్ దైవజ్ఞరత్న ఆకొండి వెంకటేశ్వర శర్మ మీడియాకు తెలిపారు.

14వ వార్డులో మన ఇంటికి మన వర్మ

విశాలాంధ్ర-పిఠాపురం: పిఠాపురం టౌన్ 14వ వార్డులో మాజీ ఎమ్మెల్యే వర్మ అధ్యక్షతన మన ఇంటికి మన వర్మ ఆశీర్వదిద్దాం & మహాశక్తి కార్యక్రమాలు నిర్వహించి, ప్రతి ఇంటికి వెళ్ళిగత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసినకార్యక్రమాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ వార్డులలో పర్యటన చేస్తుంటే అన్ని సమస్యలేనని, టౌన్ పారిశుద్ధ్యం, సానిటేషన్ నిర్వహణ పై వార్డులో పట్టణ నిద్ర కార్యక్రమం చేపట్టామని తెలిపారు. వైసీపీ అధికారం చేపట్టి నాలుగున్నారేళ్ళు గడుస్తున్న హౌసింగ్ లోన్స్, నిరుపేదలకు పట్టాలు, కొత్త రేషన్ కార్డులు, అమ్మ ఒడి, పెన్షన్స్ ఇవేమీ ఈ ప్రభుత్వం కలిపించడం లేదని, అన్ని రంగాలు వారిని ఈ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందని, ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీలు, వంట గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలు అడ్డగోలుగా పెంచి పేదవాడి నడ్డి విడిచారని విమర్శించారు. చంద్రబాబు మహిళలకు మహాశక్తి ద్వారా భవిష్యత్తుకు గ్యారంటి పేరుతొ మహానాడు వేదికగా పథకాలు ప్రకటించారని ఈ పథకాలు వలన ఆడపడుచులకు ఎంతో మేలు జరుగుతుందని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డెం భాస్కర్ రావు, కౌన్సిలర్ నల్లా రవణమ్మ, వార్డు ఇంచార్జు నల్లా మాణిక్యం, వార్డు నాయకులు నల్లా శ్రీను, తోట బాబి, నల్లా గోవిందు, చిటికెల నాయుడు, గౌతు సతీష్, మల్లిపాముల శ్రీనువాస్,

గౌతు శ్రీనువాస్, శీరం భద్రం మరియు పిల్లి చిన్న, కోరుప్రోలు శ్రీను, కౌన్సిలర్ అల్లవరపు నగేష్, కోళ్ళ బంగారు బాబు, రాయుడు శ్రీను, మాజీ కౌన్సిలర్ నామా దొరబాబు, మసకపల్లి రాజా, వేణుం సురేష్, నాయకులు సోము సత్యనారాయణ, పెదిరెడ్ల నంది, వోగేటి మురళి, నుతాటి ప్రకాష్, వీరు నాయుడు, రాయవరపు తిరుమలరావు, ఇమ్మిడిశెట్టి సోనబాబు, మట్ట గణేష్, కర్నాసుల రాజా, షేక్ యాసిన్, చెల్లురి అశోక్, వేణుం శ్రీను, చింతపల్లి రాజు, నాళం స్వామి, వరద సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ శాఖ సమావేశం

విశాలాంధ్ర-మామిడికుదురు: తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని రానున్న రోజుల్లో వారికి మరిన్ని ఉన్నత పదవులు కట్టబట్టే యోచనలో అధిష్టానం ఉందని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ అన్నారు. పార్టీ ఆదేశాల ప్రకారం ప్రతినెలా 5వ తేదీన జరిగే గ్రామ శాఖ సమావేశాన్ని శనివారం నగరం గ్రామంలో కొత్తరోడ్‌లో మారుతి వెంచర్స్‌లో టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు జాలెం సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా బూత్ ఏజెంట్లు వారి వారి పరిధిలోని ఓట్లను ఎప్పటికప్పుడు పునఃపరశీలన చేసుకోవాలని సూచించారు. పార్టీ తలపెట్టే ప్రతి కార్యక్రమాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి మరింత మందికి చేరువయ్యేలా ప్రణాళికలు రశించాలని పేర్కొన్నారు. అదేవిధంగా మహాశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జరిగే మేలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరం సర్పంచ్ జాలెం

రమణకుమారి, బోణం బాబు, వర్ధినిడి బాబ్జి, చుట్టుగుల్ల కిషోర్, మద్దాల నాగబాబు, మొల్లేటిపార్వతి, మొల్లేటి నాగేశ్వరరావు, వార్డు మెంబర్లు రాయుడు ఆనందరావు ,కోళ్ల సురేష్ బాబు మొల్లేటి శ్రీను, గుబ్బల నరసింహ శెట్టి, రాయుడు శ్రీనివాస్, గుబ్బల శ్రీనివాస్, గుబ్బల శివన్నారాయణ, పితాని నాగేశ్వరరావు, పితాని వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన పసికందు

విశాలాంధ్ర-అనపర్తి: స్థానిక పాత ఊరిలోని బాపనమ్మ గుడి ప్రాంతంలో ముక్కు పచ్చలారని పసికందు (మగ బిడ్డ) ను పట్టపగలు రోడ్డు పక్కన గల ఒక రేకు షెడ్డులో వదిలేసి వెళ్లిన సంఘటన కలకలం రేపింది. ఆదివారం నాలుగు రోడ్ల కూడలి, జన సంచారం గల ప్రాంతంలో అప్పుడే పుట్టిన పసికందును వదిలేయడం పట్ల అక్కడకు చేరుకున్న మహిళలు శాపనార్థాలు పెడుతున్నారు.తమ సుఖం కోసం అక్రమ సంబంధానికి పాల్పడగా జరిగిన పొరపాటు వలన పుట్టిన బిడ్డ కావచ్చు అనే అనుమానాన్ని అక్కడకు చేరుకున్న పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. తల్లి పొత్తిళ్లలో ఉండాల్సిన పసికందు రోడ్డు పక్కన విలవిలలాడుతూ కనిపించడంతో అక్కడకు చేరుకున్న పలువురు ఆవేదన చెందారు.కాగా మధ్యాహ్నం 12:30 ప్రాంతంలో స్థానిక ఏరియా ఆసుపత్రికి సర్పంచ్ వారా కుమారి, పోలీసులు తీసుకుని రావడం జరిగిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామ గుర్రెడ్డి తెలిపారు.

మగ శిశువుకు వైద్య సహాయం అందించడం జరిగిందని శిశువు క్షేమంగానే ఉన్నాడని డాక్టర్ గుర్రెడ్డి చెప్పారు. తదుపరి శిశువు వివరాలు ఐసిడిఎస్ డిపార్ట్మెంట్కు సమాచారం అందించడం జరుగుతుందని డాక్టర్ గుర్రెడ్డి వెల్లడించారు.

ఆదరణ చూసి ఓర్వలేక పోతున్న వైసీపీ

విశాలాంధ్ర-అనపర్తి/రంగంపేట: పులివెందుల, పుంగనూరు సభల్లో చంద్రబాబు నాయుడు సభలకు లభిస్తున్న ఆదరణ చూసి వైసీపీ నాయకులకు నిద్ర పట్టడం లేదని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం వడిశలేరులో నల్లమిల్లి మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై దాడి చేయడానికి ప్రయత్నిస్తే ఆ ప్రయత్నం బెడిసి కొట్టి వైసిపి కార్యకర్తలను మన కార్యకర్తలు తరిమికొట్టిన తీరు పట్ల మనం ఆలోచన చేయాలని అంటే ప్రభుత్వం పట్ల వ్యతిరేకత, ప్రజలు కార్యకర్తల్లో తెగువ, తెగింపు ఏ విధంగా ఉందో అర్థమవుతుందని నల్లమిల్లి అన్నారు. ఈ విధంగా ప్రభుత్వాన్ని ఎదుర్కోవడం అనపర్తి నియోజకవర్గం లో మొదలయ్యిందని నేడు పులివెందుల, పుంగనూరుకు చేరిందని ఆయన చెప్పారు. ఈనెల 8వ తేదీన కోరుకొండలో జరిగే నారా చంద్రబాబునాయుడు సభను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి పార్టీ నేతలు కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద్, డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ వెంకటరాజు, జిల్లా సాంస్కృతిక విభాగ అధ్యక్షులు సత్తి దేవదాన రెడ్డి, జగ్గంపేట మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-తాళ్లపూడి: తాళ్ళపూడి మండలం పెద్దేవం గ్రామం లో దళితుల దశాబ్దాల కోరిక గా ఉన్న దళిత స్మశాన వాటిక రహదారి నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెూం మంత్రివర్యులు డాక్టర్ తానేటి వనితమ్మ ద్వారా మోక్షం కలిగిందని తాళ్ళపూడి ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు, సర్పంచ్ తీగిరిపల్లి వెంకట్రావు లు పేర్కొన్నారు. మండల పరిషత్ నిధుల నుంచి 24 లక్షలు తో ఎస్సీ పేటలో కమ్యూనిటీ హాల్ గ్రౌండ్ ఫిల్లింగ్, దళితుల స్మశాన వాటిక రహదారి నిర్మాణం కొరకు ఆదివారం భూమి పూజ చేపట్టారు. పార్టీ లకు అతీతం గా సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు చిర్రా గంగా రావు, వైకాపా మండల మహిళా అధ్యక్షురాలు ముప్పిడి దమయంతి, వార్డు మెంబర్లు కొయ్య మంగ, తిగిరిపల్లి రమేష్, పట్టపు స్వర్ణకుమారి, తిగిరిపల్లి సంపతి కుమారి, గ్రామ కమిటీ అధ్యక్షులు నరాల శెట్టి వీర వెంకట్రావు, సచివాలయ కన్వీనర్ బట్టు సుబ్బారావు, వైఎస్ఆర్సిపి నాయకులు యండపల్లి కృష్ణార్జునుడు, తిగిరిపల్లి ప్రసాద్, ఒరిగేటి అశోక్, కొల్లి సత్తిపండు, జొన్నకూటి ప్రకాష్, చీర్రా గోపి, లే అవుట్ కమిటీ చైర్మన్ గెద్దం వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు బట్టు గంగరాజు, బట్టు రామారావు, తిగిరిపల్లి గోపి, బట్టు అంజిబాబు, కొయ్య లక్ష్మన్ , పెరుగుల రాజు, ఘనసాల నవీన్, కవల కొండా,బుంగా పోసి బాబు, అరుంధతి యూత్ సభ్యులు మరియు సమతా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

'వరి నారు'కు పెరిగిన డిమాండ్

విశాలాంధ్ర-కూచిపూడి: గత నెలలో కురిసిన అధిక వర్షాలతో ఒకవైపు నాటు వేసిన పొలాలు, ఇంకోవైపు వరి నారుమడులు దెబ్బతినడంతో పాడైపోయిన పొలాలలో మరల నాటు వేసుకోవడానికి నారు కొరత ఏర్పడింది. దీనితో నాట్లు వేసుకొన్న రైతుల వద్ద మిగిలిన నారుమడులకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. గత ఏడాది అధికంగా పోసుకున్న నారుమడులతో తిప్పలుపడ్డ రైతులు ఎవరికి వారు సరిపడా నారుమడులు పోసుకున్నారు. అయితే ఆదిలోనే హంసపాదనట్లుగా ప్రకృతి పగబట్టి వర్షాల రూపంలో రైతులను నట్టేట ముంచింది .దీనితో వరి నారుమడుల ధరలకు రెక్కలు వచ్చేశాయ్. ఒకసెంటు నారుమడి సుమారు రూ, వెయ్యి నుంచి రూ.15 వందలకు పైగా పలుకుతోంది. కొన్ని చోట్ల అది రెండు వేలకు పైగా చేరుకొన్నట్టుతాజా సమాచారం!. వ్యవసాయ శాఖ రాయితీ మీద వరి వంగడాలను ఇస్తామని ప్రకటించినా ఆసక్తి కనపరచనీరైతులు చేతికి అందిన నారును అధికధర చెల్లించైనా కొనుక్కొని తీసుకెళ్లడానికి నిశ్చయించుకుని గ్రామాలలో వేట మొదలుపెట్టారు. అదేవిధంగాఈఏడాది అధిక సంఖ్యలో"వెద"పద్ధతిన వరి సాగు చేసిన పొలాలలో కొన్నింట్లో అధికంగా నీరు నిలబడి మొలక దెబ్బతింది. దీంతో ఆ రైతులు కూడా కూలీలతో నాటు వేయించుకోవడానికి పొలాలు దమ్ము చేయించుకుని వరి నారు కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితులలో మొవ్వ, పమిడిముక్కల, గూడూరు, బందరు, ఘంటసాల, పామర్రు తదితర మండలాల్లో గల వరినారును కొనుగోలు చేసుకుని ట్రాక్టర్ల పై తెచ్చి నాటు వేసుకుంటున్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీ

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ కార్పొరేషన్ (సిహెచ్ఆర్ఎంసి) ఇండోర్ స్టేడియంలో ఆదివారం ముగిసిన ఐఎల్ఐఒఎస్ ఆధ్వర్యంలో జరిగిన రెండవ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో విజయవాడకు చెందిన ఎస్‌జిటిటిఎ పాడ్లర్ ఆర్ కాజోల్ సునర్ మహిళల సింగిల్స్ మరియు మిక్స్‌డ్ డబుల్స్‌లో డబుల్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. పురుషుల విభాగంలో పోస్టర్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పవన్‌కుమార్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ విజేతగా నిలిచారు.మహిళల సింగిల్స్ ఫైనల్స్‌లో ఆర్ కాజోల్ సునర్ (ఎస్‌జీటీటీఏ) 3-1 సెట్లలో శైలా నూర్ బాషా (డీటీటీఏ)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో పవన్ కుమార్ (పోస్టల్) 4-0 వరుస సెట్లలో టి ప్రభాత్ సాయి (రాజమహేంద్ర వరం)పై గెలిచాడు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైఎస్ఆర్‌సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ విజేతలకు, రన్నర్‌లకు పతకాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కెవిఎస్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పి విశ్వనాథ్, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె బలరాం తదితరులు పాల్గొన్నారు.

బైక్ దగ్ధం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): బుల్లెట్ అగ్నికి ఆహుతి అయింది. ఈ ఘటన ఆదివారం విజయవాడ సూర్యారావు పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఉదయ్ శంకర్ అనే వ్యక్తి తన బుల్లెట్ బైక్ పై బీసెంట్ రోడ్డు నుండి పుష్పా హోటల్ సెంటర్‌కు వస్తున్న సమయంలో రోడ్డు మీద అడ్డంగా కేబుల్ వైర్ మెడకు చుట్టూకొని కిందపడిపోయాడు. బైక్ అదుపు తప్పి పెట్రోల్ ట్యాంక్ నుండి పెట్రోల్ బయటికి వచ్చి ఒక్కసారిగి మంటలు చెలరేగాయి. దీంతో రోడ్డు పై బుల్లెట్ అగ్నికి ఆహుతి అయింది. వెంటనే స్థానికులు నీరు తీసుకుని వచ్చి మంటలను అదుపు చేశారు.

నేటి నుండి జాతీయ చేనేత వారోత్సవాలు

విశాలాంధ్ర-విజయవాడ: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు చేనేత వినియోగాన్ని ప్రోత్సహించేలా విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చేనేత, జౌళి శాఖ కమీషనర్, ఆప్కో ఎండి ఎంఎం నాయక్ తెలిపారు. చేనేత, జౌళి శాఖ, ఆప్కో సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 7 జాతీయ చేనేత వారోత్సవాలను ఘనంగా ప్రారంభించనున్నామన్నారు. నగరంలోని మేరీస్ స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియం ఈ కార్యక్రమాలకు వేదిక కానుందన్నారు. సోమవారం నుండి 12 వరకు హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఘనంగా అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకమ్

విశాలాంధ్ర-భీమవరం టౌన్: అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథక కార్యక్రమాన్ని భీమవరం టౌన్ స్టేషన్ లో రైల్వే అధికారులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందించిన సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయిని రైల్వే డిఈఎన్ (ఈస్ట్) విజయవాడ కే శ్రీధర్ ఘనంగా సత్కరించారు. అనేక సంవత్సరాలుగా రైల్వే కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా రైల్వే కాలనీ వాసులకు భోజన సదుపాయం కూడా అందించే వారని అన్నారు. సత్కార గ్రహీత రంగసాయి మాట్లాడుతూ వేస్ట్ బెర్రీ స్కూల్, ఆదిత్య స్కూల్, శ్రీభాష్యం స్కూల్ విద్యార్థులచే భారత నాట్యం, జిపిసి శేఖర్ రాజుల బృందం 26 మందిచే రోప్ స్కిప్పింగ్, అత్తిలి కోలాట బృందం వారిచే కోలాట లతో సుమారు 3 గంటల పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు.37 మంది ఎన్ సిసి కేడేట్లకు సర్టిఫికెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ కోయ్యే మోషే న్ రాజు, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, ఎంపి కనుమూరి రఘురామ కృష్ణంరాజు తనయుడు భారత్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస వర్మ, పాక సత్యనారాయణ, కోటికలపూడి గోవిందబాబు, డి అర్ ఓ కృష్ణవేణి, ఎన్ సీసి కెప్టెన్ ఏ వీరయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన సిగ్గుచేటు

విశాలాంధ్ర-ఆకివీడు: దేశం సిగ్గుపడే విధంగా మణిపూర్ సంఘటన ఉందని ఐక్య క్రైస్తవ వేదిక కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆకివీడు మండలం ఐక్యక్రైస్తవ వేదిక ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఐకి వినతి పత్రం అందజేశారు. ఆకివీడు నగర పంచాయతీ వైస్ చైర్మన్ వంగా జోష్న, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎండి మస్తాన్ వల్లి, ఐక్య క్రైస్తవ నాయకులు బంటుమిల్లి సురేష్, జ్ఞానప్రకాష్, వైసీపీ నేతలు అంబటి రమేష్, కటికతల రాజారావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

విశాలాంధ్ర-ఉండి: రూ.85 లక్షల ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు చేసిన పనులను నరసాపురం పార్లమెంటు సభ్యులు కనుమూరు రఘు రామకృష్ణంరాజు కుమారుడు కనుమూరి భరత్ ఆదివారం తన అనుచరులతో కలిసి ఆదివారం పరిశీలించారు. భరత్ కు లబ్ధిదారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భరత్ మీడియాతో మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని రంగాల్లోనూ సంపూర్ణ అభివృద్ధి చేయాలన్నదే ఎంపీ రఘురామకృష్ణంరాజు కోరికని తెలిపారు. భీమవరం సి ఎస్ ఎన్ కాలేజీ ప్రత్యేక భావన అభివృద్ధికి రూ.25 లక్షల ఎంపీ నిధులు మంజూరు చేశారని, శ్రీకృష్ణదేవరాయల (కాపుల) కళ్యాణ మండపం అభివృద్ధికి రూ. 25 లక్షల ఎంపీ నిధులు మంజూరు చేశారన్నారు. ఆర్ ఆర్ డి ఎస్ కాలేజీ అభివృద్ధికి రూ.35 లక్షల ఎంపీ నిధుల తో చేపట్టిన పనులను పరిశీలించడం జరిగిందని తెలిపారు. గ్రామాల్లో సిసి రోడ్లు, వంతెనలు, డ్రైనేజీ నిర్మాణాలు, స్మశాన వాటిక అభివృద్ధి పనులు వంటి అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పార్లమెంటు పరిధిలో ఎంపీ పర్యటించకపోయినా పార్లమెంటు పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కారానికై తన వంతు కృషి ఆయన చేస్తున్నారన్నారు. మాజీ డిసిసిబి చైర్మన్ ముత్యాల రత్నం మాట్లాడుతూ కనుమూరి రఘురామ కృష్ణంరాజుకు తన పార్టీ నాయకులే పార్లమెంటు పరిధిలో తిరగనివ్వకుండా చేసినప్పటికీ అభివృద్ధి చేయాలన్న ఆశయానికి ఎవ్వరు అడ్డుకట్టు వేయలేరన్నారు. నిస్వార్థమైన నాయకుడిని పార్లమెంటులో దూరం చేసుకున్నామని అటువంటి నాయకుడు మన పార్లమెంట్ సభ్యులు కావడం నరసాపురం పార్లమెంట్ ప్రజల అదృష్టం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ను అభివృద్ధి పథంలో నడిపించాలి

విశాలాంధ్ర-కలిదిండి: వ్యవసాయ పరపతి సంఘాలను అభివృద్ధి పథంలో నడిపించాలని దూలం. నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కలిదిండి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్ వడుపు. రామారావు ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కలిదిండి పిఎసిఎస్ ను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. గత పిఎసిఎస్ చైర్మన్ ఊర .కళ్యాణి వందకు వంద శాతం అభివృద్ధి పరిచారని అన్నారు. కలిదిండి పిఎసిఎస్ కు మొదటి నుంచి సేవలు అందించి మన ముందు భౌతికంగా దూరమైన చిట్టూరి. వెంకట రంగనాయకులు, ఆంజనేయులు, నాగేశ్వరరావు, గోదావరి. ఆదిశేషు, నంద్యాల. వెంకటేశ్వర్లు, యలవర్తి. కృష్ణమూర్తి లకు శ్రద్ధాంజలి ఘటించారు. బాధ్యతలు స్వీకరించిన రామారావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. రామారావుకు పలువురు శాలువాలు కప్పి పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బొర్రా .సత్యవతి, ఎంపీపీ చందన. ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ కనకదుర్గారాణి, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము. రవికుమార్, సర్పంచి మసిముక్కుల. మారుతి ప్రసన్న, ఊర. కళ్యాణి, శ్రీధర్, నంబూరి. శ్రీదేవి, వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని.రమేష్, ఎస్ ఏ రాజు, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గద్దె. ఆనంద్ కుమార్, ప్రజా ప్రతినిధులు, పిఎసిఎస్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీలో రాబోయే అక్టోబర్ 2 వ తేదీ గాంధీ జయంతిరోజు నుండి ప్లాస్టిక్ కవర్లు నిషేధాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ప్రజలు ప్రజా ప్రతినిధులు అధికారులు సహకరించాలని త్వరలో అఖిలపక్షం ఏర్పాటు చేసి అందరి సహకారంతో ప్లాస్టిక్ రహిత గ్రామముగా చేయడానికి కృషి చేయాలని సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి కోరారు.గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ముప్పిడి విజయకుమారి కి పోలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ఎంపిక అవడం పట్ల ఆమెను స్థానిక ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానం నిర్వహించడం జరిగింది. పోలవరం శాసన సభ్యులు తెల్లం బాలరాజుకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మట్ట వనజ, ఉపసర్పంచ్ సంకు కొండ, ఎంపిటిసిలు గంటా శ్రీనివాసరావు, చింతా శ్రీదేవి, గంటసాల శ్రీనమ్మ, వార్డ్ సభ్యులు సూదికొండల గణేష్, మండా లక్ష్మి, మలిసెట్టి కేసుబాబు, రాచూరి మదన్,షేక్ ఆలీమ్ , ఏలేటి బాస్కరరావు, పూలపల్లి రవి, భూసి త్రిమూర్తులు, వుసల దివ్య, బలుసు నాగేశ్వరరావు, నాయకులు జానకిరామ్, మడుతూరు శ్రీనివాస్, రాజేష్, సాయి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ వ్యవస్థను నాశనం చేసిన వైసీపీ

విశాలాంధ్ర-వీరవాసరం: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను నాశనం చేసిందని పలువురు బిజెపి నాయకులు తెలిపారు. బిజెపి మండల పదాధికారుల సమావేశం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షులు కోడి నరసింహం అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ నిధులను ప్రక్కదారి పట్టించి సర్పంచ్ లకు ఏ విధమైన హక్కులు లేకుండా పంచాయితీ వ్యవస్థను నిర్వీర్యం చేసినందున సర్పంచ్ లకు అండగా నిలబడటానికి రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పిలుపు మేరకు భీమవరం కలెక్టర్ కార్యాలయం వద్ద సర్పంచ్ లకు మద్దతుగా 10వ తేదిన చేయ తలపెట్టిన ధర్నా కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు కార్యకర్తలు తప్పని సరిగా పాల్గొని విజయవంతం చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు అదేవిధంగా ఈ ధర్నా కార్యక్రమానికి సర్పంచ్ లు, వార్డు మెంబర్స్ తోపాటు పెద్ద ఎత్తున ప్రజలు కూడా హాజరు కావాలని పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో కురెళ్ళ నరసింహం, ఆకుల లీలాకృష్ణ, సిరవరపు నరేష్, వేంద్ర దివాకర్, మద్దాల పుల్లయ్య నాయుడు, గండి దుర్గా మహేష్, దగ్గు రమణ కుమారి, నౌడు హరిబాబు, ఎన్విఎస్ఎస్ రామశర్మ, అద్దాల రామకృష్ణ పాల్గొన్నారు.